www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 16 మే 2025

5

పశ్చిమ గోదావరి



ధాన్యం కొనుగోలులో ఆందోళన వద్దు : జెసి

ప్రజాశక్తి - భీమవరం

రైతులు ఎవరూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి పుకారులను, అవాస్తవాలను నమ్మొద్దని, రైతులు నేరుగా సంబంధిత రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో రబీ సీజనుకుగాను 263 రైతు సేవా కేంద్రాల ద్వారా ఇప్పటికి 71,469 మంది రైతుల వద్ద నుండి రూ.1515.43 కోట్లు విలువైన 6,58,146 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రాథమిక అంచనాగా దిగుబడిలో 7.75 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు జరగవచ్చన్నారు. ప్రభుత్వం ప్రాథమిక అంచనాగా జిల్లాకు ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు నిమిత్తం కేటాయించిందని తెలిపారు. ఇంకా కొనుగోలు నిమిత్తం కేటాయింపులు అవసరమైతే పౌర సరఫరాల సంస్థ ప్రధాన కార్యాలయాన్ని కోరతామన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో రైతులు ధాన్యం సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని, టార్పాలిన్లు కప్పుకుని ధాన్యాన్ని భద్రపరచుకోవాలని సూచించారు.

వాటి సంగతి మరిచారా..!



శిథిలావస్థకు చేరిన ఏలూరుపాడు లాకు

శిథిలావస్థలో స్లూయిస్‌లు, లాకులు, షట్టర్లు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లాలో ఇరిగేషన్ వ్యవస్థలో కీలకమైన లాకులు, వియర్లు, రెగ్యులేటర్‌లు దాదాపు 160 ఏళ్ల కిందట ఏర్పాటు చేసినవి. వీటి నిర్వహణపై దశాబ్దాలుగా నిర్లక్ష్యం నెలకొన్న సంగతి అందరికీ తెలిసిందే. డెల్టా ఆధునికీకరణ పనుల్లో వీటిని మారుస్తారని ప్రకటించినా ఆచరణలో ఆ పనులకు నిధుల కేటాయింపు ఊసే లేని పరిస్థితి. దీంతో ఆయా లాకులు, షట్టర్ల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. ప్రభుత్వాలు మారుతున్నా చేతలు మాత్రం మారడం లేదు. కేవలం వేసవి ముగింపు ముందు హడావుడిగా ఒఅండ్‌ఎం పనులు నిర్వహించేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ హయాంలో కాలువల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో అధ్వానంగా మారాయి. కాలువలు పూడుకుపోయి, షట్టర్లు తుప్పుపట్టిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పూడిక తొలగింపు పనులు కొన్నిచోట్ల ప్రారంభమయ్యాయి. పాడైన షట్టర్లను నీరు విడుదల కాకముందే అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రత కరువు.. నీటి వృథా

డెల్టాలో ప్రధాన పంట కాలువలపై లాకుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. వీటిలో నరసాపురం జిఅండ్‌వి కెనాల్‌పై ఆరేసి చొప్పున లాకులు, విఎండబ్ల్యు, బ్యాంక్ కాలువలపై మూడేసి, ఉండి, అత్తిలి, కాకరపర్రు కాలువలపై రెండేసి, జంక్షన్ కాలువపై ఒక లాకు ఉన్నాయి. ఎక్కువ శాతం లాకుల తలుపులు దెబ్బతిని నీరు వృథాగా పోతుంది. అత్యవసర వేళల్లో నీటిని డ్రెయిన్లలోకి మళ్లించిన చోట్ల ఉన్న వియర్, షట్టర్లు పలుచోట్ల దెబ్బతిన్నాయి. లాకుల కట్టడాలు శిథిలావస్థకు చేరాయి. పశ్చిమ డెల్టాలో సుమారు ఏడు కాలువల నుంచి విడిపోయే కాల్వల స్లూయిస్‌లు, షట్టర్లు దెబ్బతినడం గమనార్హం.



మొండి సమీపంలో తుప్పుపట్టి పాడైన షట్టరు

శిథిలావస్థలో ఏలూరుపాడు లాకులు

డెల్టాలో పరిమెళ్ల లాకు నుంచి ప్రారంభమైన వెంకయ్య వయ్యేరు కాల్వ ఏలూరుపాడు లాకుల వద్ద ముగుస్తుంది. ఏలూరుపాడు లాకుల నుంచి ఉప్పుటేరులో కలుస్తుంది. ఒకప్పుడు ఈ లాకుల మార్గం నుండి సరుకు రవాణా జరిగేది. మచిలీపట్నం వెళ్లేందుకు ఈ మార్గాన్ని ఉపయోగించేవారు. ప్రస్తుతం లాకు, వియర్ శిథిలావస్థకు చేరాయి. నిడమర్రు, గణపవరం, ఆకివీడు, కాళ్ల మండలాల్లోని 40 వేల ఎకరాల ఆయకట్టుకు వెంకయ్యవయ్యేరు నీరే ప్రధానం. వీటిని పట్టించుకునే నాథుడే లేరు. ఉండి నియోజకవర్గంలో ప్రధాన కాలువల్లో 23 స్లూయిస్‌లు ఉన్నాయి. తుప్పు పట్టి పాడైన షట్టరు, స్లూయిస్‌లు శిథిలావస్థకు చేరాయి.

సాగునీటి వ్యవస్థను మెరుగుపరచాలి

అంకాని రంగబాబు, రైతు, ఏలూరుపాడు



బ్రిటీష్ కాలం నాటి ఇరిగేషన్ వ్యవస్థే కొనసాగుతోంది. అధ్వానంగా ఉన్న వ్యవస్థను మెరుగుపరచడంలో పాలకులు విఫలమవుతున్నారు. స్లూయిస్‌లు, లాకులు, షట్టర్లు బాగు చేయించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. కాల్వల ద్వారా నీటిని వదిలే సమయానికి వాటికి కనీసం మరమ్మతులు చేపట్టాలి.

పనులు జరిగేలా కృషి చేస్తా

పివిఎన్‌వివి.సత్యనారాయణమూర్తి, ఇరిగేషన్ డిఇ

గతంలో మంజూరైన నిధులతో పంట కాలువల్లో పూడికతీత పనులు కొన్నిచోట్ల జరుగుతున్నాయి. పంట కాలువల్లో స్లూయిస్‌లు, షట్టర్లు, లాకుల మరమ్మతులకు ఒఅండ్‌ఎం నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. ఉండి సబ్ డివిజన్ పరిధిలో ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.3.18 కోట్ల అంచనా వ్యయంతో 48 పనులను, ఉండి నియోజకవర్గంలో రూ.3.40 కోట్ల అంచనా వ్యయంతో 81 పనులను, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో రూ.3.23 కోట్ల అంచనా వ్యయంతో 13 పనులు, భీమవరం నియోజకవర్గంలో రూ.40 లక్షలు అంచనా వ్యయంతో 11 పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. జూన్ మొదటి వారంలో కాలువలకు నీటిని విడుదల చేస్తాం.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

విస్సాకోడేరులో రూ.10 కోట్లతో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకోడేరు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా నూతన ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. విస్సాకోడేరు గ్రామంలో రూ.10.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ప్లాటెడ్ కాంప్లెక్స్ (ఇండస్ట్రియల్ పార్క్) నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణానికి ఆలోచన చేసిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. నాలుగు నెలల్లో కాంప్లెక్స్ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, ఇక్కడికి రాకపోకలకు అనువుగా రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్లాటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఇప్పటికే రూ.9.50 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్లాటెడ్ కాంప్లెక్స్ ఏర్పాటు చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎపిఐఐసి చైర్మన్ రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్‌ఎంఇ ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే 11 నిర్మాణాలను పూర్తి చేశామని, 39 నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. దీనిలో భాగంగా మన జిల్లాలో తొలివిడతగా ఉండి నియోజకవర్గంలో ఎంపిక చేసి ప్లాటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. విస్సాకోడేరులో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్లాటెడ్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు రోడ్డు, డ్రైన్లు వంటి అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎపిఐఐసి జిల్లా మేనేజర్ బాబ్జి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి య.మంగపతిరావు, తహశీల్దార్ విజయలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్, కలెక్టర్, ఎపిఐఐసి చైర్మన్

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె

18 రోజులుగా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం

భీమవరంలో సిహెచ్‌ఒల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్లు స్పష్టం చేశారు. 18 రోజులుగా నిరసన తెలుపుతున్నా అటు ప్రభుత్వంగాని, ఇటు ప్రజాప్రతినిధులుగాని కనీసం పట్టించుకోకపోవడం అత్యంత దారుణమని విమర్శించారు. సామాన్య, మధ్యతరగతి ప్రజానీకానికి వైద్య సేవలు అందించి వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తున్న తమపై ప్రభుత్వం కక్ష సాధింపు వ్యవహరించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు.

భీమవరం కలెక్టరేట్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కమ్యూనిటీ హెల్త్‌ఆఫీసర్లు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 18వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఎండను సైతం లెక్కచేయకుండా పెద్దసంఖ్యలో తరలొచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎపి ఎంఎల్‌హెచ్‌పి సభ్యులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తాము అంకితభావంతో పని చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ర్యాలీ ముగిసిన అనంతరం కలెక్టరేట్ వద్ద సిహెచ్‌ఒలు నిరవధిక సమ్మె శిబిరంలో కూర్చుని నిరసన కొనసాగించారు.



శాంతియుత ర్యాలీ చేస్తున్న సిహెచ్‌ఒలు

ఇళ్ల స్థలాల నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - భీమవరం

అందరికీ ఇళ్లు పథకంలో ప్రభుత్వం విధించిన నిబంధనలు సడలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ కోరారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నిబంధనలు సడలించకపోతే ఇళ్ల స్థలాల అర్హులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని స్పష్టం చేశారు. అందరికీ ఇళ్ల పథకంలో ప్రభుత్వ నిబంధనల వల్ల అనేక ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కేవలం కొందరికి మాత్రమే ఇళ్ల స్థలాలు వస్తాయి తప్ప అందరికీ రావనేది నిబంధనలు చెప్పకనే చెబుతున్నాయన్నారు. మెరక భూమి ఐదెకరాలు, మాగాణి 2.5 ఎకరాల్లోపు ఉన్న వారందరినీ అర్హులుగా గుర్తిస్తామని చెప్పడాన్ని ఆహ్వానిస్తున్నామని చెప్పారు. తండ్రికి ఇద్దరో, ముగ్గురో కొడుకులుంటే తండ్రికి రెండు, మూడు సెంట్లు స్థలం ఉంటే కేవలం ఒక కుమారుడిని మాత్రమే ఇంటి స్థలానికి అర్హునిగా చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఘర్షణలు ఏర్పడి కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల వల్ల నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ప్రతి కుటుంబానికి గ్రామాల్లో మూడు సెంట్లు గ్రామాలు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇస్తానని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, తక్షణం ఆ హామీని అమలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కాలనీల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించలేదని ఆరోపించారు. దీంతో ఆ స్థలాల్లో అర్హులుగా ఉన్న వారంతా ఇప్పటికీ ఇళ్లు నిర్మించుకోలేదని గుర్తు చేశారు. దీనికితోడు వారి ఆర్థిక పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని, వారికి ప్రభుత్వం సాయం అందించాలని కోరారు.

ముగ్గురు కొడుకులు ఉంటే ఒక్కరే
అర్హులనడం సరికాదు
కుటుంబాలు విచ్ఛిన్నానికి దారి తీస్తాయి
కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని
నిలబెట్టుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

మురిపించిన వర్షం

సేదతీరిన జనం



పాలకొల్లులో కురిసిన భారీ వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

ప్రజాశక్తి - తణుకు

పట్టణంలో గురువారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండవేడిమి, ఉక్కబోతతో తల్లడిల్లుతున్న జనం దీంతో ఉపశమనం పొందారు. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షం జనానికి ఒకింత ఉపశమనాన్నిచ్చింది. పట్టణంలోని వీధి వ్యాపారులు కొంత ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరు: గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురు, గాలులు ఉరుములతో వర్షం కురిసింది. దీంతో జనం ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందారు.

పాలకొల్లు: గురువారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో వర్షం దంచికొట్టింది. దీంతో వాతావరణం చల్లబడింది. గాలుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు.

పెనుగొండ: మండలంలో గురువారం మధ్యాహ్నం బలమైన ఈదురుగాలులతో వర్షం కురిసింది. గాలుల వల్ల పెనుగొండ, వడలి గ్రామాల మధ్యలో పెద్దింట్లమ్మ ఆలయ సమీపంలో పెద్దపెద్ద చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గింది.

ఆచంట: మండలంలో ఉదయం నుంచి తీవ్రమైన ఉక్కబోత, ఎండతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, వర్షం ఉపశమనాన్నిచ్చాయి. వాతావరణం చల్లబడటంతో జనం సేదతీరారు.

పెనుమంట్ర: మండలంలో ప్రజలు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో సేదతీరారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. అయితే ధాన్యం రైతులు మాత్రం కొంత ఇబ్బంది పడ్డారు.



పెనుగొండ వడలి మార్గమధ్యలో నేలకొరిగిన వృక్షం

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకు

అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ మస్టర్ పాయింట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ రద్దు చేస్తే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, కార్మికుల సంఖ్య పెంచాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఎన్ని ప్రభుత్వాలు మారినా మున్సిపల్ కార్మికుల జీవితాల్లో ఎలాంటి మార్పులూ లేవని అన్నారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత వైసిపి ప్రభుత్వం చెప్పి చేయకుండా మోసగించిందని విమర్శించారు. ప్రభుత్వమే కనీస వేత చట్టాలు అమలు చేయకపోతే ప్రయివేటు వాళ్లు ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో మున్సిపల్ కార్మికులు అందరూ పాల్గొనాలని ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, రమేష్, మంగమ్మ, అయ్యప్ప, కృష్ణబాబు, సుమ, కొమరరాణి, కేశవ, నాగరాజు, లక్ష్మీ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

మానసిక, బహుళ వైకల్య బిడ్డల సంరక్షణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

తల్లిదండ్రులు లేని మానసిక బహుళ వైకల్యాలు కలిగిన బిడ్డల సంరక్షణకు చట్టపరమైన సంరక్షకత్వం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ట్రస్ట్ యాక్ట్‌పై జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ న్యూరో డెవలప్మెంటల్ రుగ్మత, మస్తిష్క పక్షవాతం, మానసిక మాంద్యం, బహుళ వైకల్యాలు కలిగిన బాలల సంరక్షణకు నేషనల్ ట్రస్ట్ యాక్ట్ ద్వారా చట్టపరమైన సంరక్షకత్వం హక్కును కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. జిల్లాలోని వివిధ కళాశాలలో రెగ్యులర్‌గా చదువుకుంటున్న వికలాంగులు బి.సౌమ్య, పట్టి దుర్గా వంశీ, సోర్రా పవను ముత్యాలు, రాటి పల్లి సాయిరాం, బాలా కరుణ ప్రశాంతి, గోగులమండ వినోద్ కుమార్, గోపిశెట్టి సుభాష్ చంద్రబోస్‌కు ఒక్కొక్కటి రూ.38 వేలు ప్రభుత్వ వ్యయంతో కొనుగోలు చేసిన లాప్‌టాప్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్, కమిటీ సభ్యులు అంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ రిహాబిటేషన్ ప్రతినిధి ప్రసాద్, వికలాంగ మహా సంఘటన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఎస్ఎస్.రమేష్, సైకాలజిస్ట్ జి.జేసెస్ ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

పూడిక తీత పనులు చేపట్టాలని రైతుల ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

రుస్తుంబాద డ్రెయిన్‌పై ఆక్రమణలు తొలగించి, డ్రెయిన్‌లో పూడికతీత పనులు చేపట్టాలని మూడు గ్రామాల రైతులు గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీగా జనసేన కార్యాలయానికి చేరుకుని ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌కు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ పెద్దిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యర్రంశెట్టివారిపాలెం మాజీ సర్పంచి కలవకొలను తాతాజీ మాట్లాడుతూ డ్రెయిన్ పొడవునా సుమారు మూడు కిలోమీటర్లమేర ఆక్రమణలకు గురైందన్నారు. ఈ ఆక్రమణల వల్ల ఆరు సంవత్సరాల నుండి సుమారు 600 ఎకరాల్లో సాగు కష్టంగా మారిందన్నారు. వెంటనే ఆక్రమణలు తొలగించి పూడిక తీత చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కంబాల మామాజీ, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, జడ్డు ఫణీంద్ర పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతులు


సార్వాలో ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తాం

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు నియోజకవర్గంలో రాబోయే సార్వా నుంచి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడించారు. గురువారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని వినూత్నంగా, ప్రయోగాత్మకంగా డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకుని పంట కాలువల ప్రక్షాళనకు చేపట్టిన విధానాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండపాక-పైడిపర్రు మడుగు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, కిక్కిస గుర్తించి ప్రక్షాళన చేసేందుకు చేపట్టిన విధానం మందు పిచికారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వా నుంచి రైతులకు అన్ని సౌకర్యాలతో పాటు పూర్తిగా సాగునీరందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధానమంత్రి మోడీ ఆలోచనలకు అనుగుణంగా గతంలో ఎప్పుడూ లేని విధంగా టెక్నాలజీ వినియోగించుకొని పంట కాలువల్లో పేరుకున్న గుర్రపు డెక్క, కిక్కిసను డ్రోన్ సహాయంతో గుర్తించి మందు పిచికారీ చేసి నిర్మూలించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దాదాపు పది నిమిషాల వ్యవధిలోనే మూడు కిలోమీటర్ల మేర సర్వే చేసి మందు పిచికారీ చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తణుకు మున్సిపాల్టీ పరిధిలో చెరువులను సైతం ప్రక్షాళణ చేసేందుకు ఇదే విధానాన్ని అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమంట్ర : తెలుగు నేలను గోదావరి, కృష్ణా జలాలతో నిత్యం సస్య శ్యామలం చేసిన మహనీయుడు కాటన్ దొర అని మార్టేరు ఇరిగేషన్ సెక్షన్ ఎఇఇ గుబ్బల జయశంకర్ అన్నారు. గురువారం మార్టేరు ఇరిగేషన్ శాఖ ప్రాంగణంలోని సర్ ఆర్థర్ కాటన్ విగ్రహం వద్ద ఆయన 222వ జయంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది ఎన్.బాబులు, సిహెచ్‌ఎన్ఎస్.శర్మ, వి.జోసఫ్, లస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్ టెక్నాలజీని పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

త్వరలో రెండు ఓపెన్ ఎయిర్ థియేటర్లు : డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి - ఆకివీడు

నియోజకవర్గంలో త్వరలో రెండు ఓపెన్ థియేటర్లు నిర్మించనున్నట్లు ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్ నాగరాణితో కలిసి మండలంలో పర్యటించారు. ముందుగా తన స్వగ్రామం అయి భీమవరంలో ఆయన పెద్ద తండ్రి మాజీ మంత్రి కనుమూరు బాపిరాజును కలిశారు. అనంతరం గ్రామంలోని వేద పాఠశాలను పరిశీలించారు. అక్కడ నుంచి మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, కేంద్రం పక్కనే ఉన్న పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలోని పలు సమస్యలను సిబ్బంది, వైద్యులు ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు. పరిశీలన అనంతరం సుమారు గంటన్నర సేపు ఆయన జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజవర్గంలోని పెదమిరం వద్ద ఒక ఓపెన్ థియేటర్, స్థానిక సిహెచ్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో ఒక కళా సాంస్కృతిక భవనం లేదా మరో ఓపెన్ దియేటర్ జూన్ మొదటి వారంలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తిచేసి ప్రారంభిస్తామన్నారు. ఆసుపత్రిలో డాక్టర్ లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్న విషయం తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెంటనే రెండు రోజుల్లో ఇక్కడ రెండు ప్రత్యేక విభాగాల నిపుణులను నియమిస్తామన్నారు. ఆసుపత్రిలో ఇప్పటికే కిడ్నీ సమస్య ఎదుర్కొంటున్నవారికి నడుస్తున్న డయాలసిస్‌ను త్వరలో రెండో షిఫ్ట్ ప్రారంభిస్తామన్నారు. తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ నాగరాణి, డ్వామా పీడీ, ఆర్‌డిఒ, నాయకులు పాల్గొన్నారు.

మా ఉద్యోగాలు పర్మినెంట్ చేయండి

వేద అధ్యాపకుల రోదన

అయిభీమవరం టిటిడి వేద పాఠశాల అధ్యాపకులు తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలంటూ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజుకు వినతిపత్రం అందజేశారు. వేసవికాలం మూడు నెలలు తమ జీతాలు ఉండడం లేదని ఇతరత్రా ఆదాయం వచ్చే అవకాశాలు తమకు ఏమీ లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఇక్కడ ఉద్యోగాలు చేస్తున్నా తమ కాంట్రాక్టు ఉద్యోగాలు ఉంటాయో తెలియని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త రేషన్ కార్డులు పొందేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్ అయితం సత్యనారాయణ తెలిపారు. కొత్త రేషన్ కార్డులు కావాల్సిన వారు, తల్లిదండ్రుల కార్డుల నుంచి విడిపోవాలనే వారు, పెళ్లయిన వారు కొత్త కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పిల్లల్ని కార్డుల నమోదు చేయడంతో పాటు చిరునామా మార్పు, కార్డులో తప్పులుంటే సరిదిద్దుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 30 వరకూ అర్హులైన వారు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ పేర్కొన్నారు.

ముగిసిన ఉచిత డిఎస్‌సి కోచింగ్

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 110 రోజులపాటు నిర్వహించిన ఉచిత డిఎస్‌సి కోచింగ్ సెంటర్‌లో ప్రతి విద్యార్థీ విజేతలుగా నిలిచినప్పుడే తనకు నిజమైన సంతృప్తి అని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి రామానాయుడు సొంత ఖర్చులతో 110 రోజులపాటు, 800 మంది అభ్యర్థులకు నిర్వహించిన ఉచిత డిఎస్‌సి శిక్షణ ముగింపు కార్యక్రమం బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో జరిగింది. సభకు మంత్రి అధ్యక్షత వహించి మాట్లాడారు. ముందుగా శిక్షణ ఇచ్చిన అధ్యాపకుల దంపతులను ఘనంగా సన్మానించారు. శిక్షణ పొందిన అభ్యర్థులు ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3 నెలలకు పైగా ఉచిత శిక్షణతో పాటు స్టడీ మెటీరియల్, భోజనం టిఫిన్ వంటి సౌకర్యాలను అందించిన మంత్రి రామానాయుడుకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ సందర్భంగా మంత్రి చంద్రబాబు ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొందిన వారంతా ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

మొగల్తూరు:ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్ కుమార్ తెలిపారు. 50 రోజులుగా అమ్మవారికి యాత్రికులు కానుకలు, మొక్కుబడుల రూపంలో చెల్లించుకున్న హుండీ ఆదాయం రూ.10,71,709 సమ కురిందని అరుణ్ కుమార్ తెలిపారు. నరసాపురంలోని అమరేశ్వర స్వామి దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్‌వివి రామచంద్ర కుమార్ పర్యవేక్షణలో లెక్కించమన్నారు. ఈ లెక్కింపులో ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వీరవాసరం :పాలకోడేరు సబ్ డివిజన్ వీరవాసరం సెక్షన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 16వ తేదీన వీరవాసరం ఎంఆర్‌కె పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న శ్రీసత్యవతి కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు ఇపిడిసిఎల్ భీమవరం వారి ఆధ్వర్యంలో సిజి ఆర్ఎఫ్ ఎపి ఇపిడిసిఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఎఇ అప్పారావు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణతో పాటు సాంకేతిక సభ్యులు బి.సురేఖ రాణి ఆర్థిక సమస్యలపై షేక్ బాబర్ వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి శిక్షణ తరగతులు భేష్

తాడేపల్లిగూడెం:స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు అద్భుతంగా జరుగుతున్నాయని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జరిగిన వేసవి శిక్షణ తరగతుల్లో జన విజ్ఞాన వేదిక సలహాదారుడు ప్రతి వీరాస్వామి విద్యార్థులకు కథలు వినిపించి, పుస్తకాలను చదివించారు. కోపల్లి శ్రీనివాసరావు, గరికపాటి బాపాయి శర్మ సిపాయిలు మాట్లాడారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ వేసవి శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని తెలిపారు.

పెనుమంట్ర : వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహించడం ద్వారా విద్యార్థులకు విలువైన సేవలు అందుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అన్నారు. గురువారం మార్టేరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు సువర్ణ గౌరి, వెంకట నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివించారు. విద్యార్థుల చేత కథలు చెప్పించడం, వారికి కథలు వినిపించడం జరిగింది. రోటరీ క్లబ్ సభ్యులు సిహెచ్ మురళీధర్ పిల్లలకు మెటీరియల్స్, జికెలో శిక్షణ ఇచ్చారు. భట్టిప్రోలు సత్యనారాయణ రిటైర్డ్ హిందీ పండిట్, సూర్యంబాబు, సుధీర్ మోహన్ పాల్గొన్నారు.

దాతల సేవలు హర్షణీయం

తాడేపల్లిగూడెం: ఓం ప్రకాష్ గోయెంకా, సీమా గోయెంకాలు తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలోని ఎస్‌సి కాలనీ, ప్రత్యాతి కాలనీ చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును ఆయన గురువారం ప్రారంభించారు. గోయెంకా ఫుడ్ ప్యాక్ట్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం సౌజన్యంతో రూ.13 లక్షల వ్యయంతో రెండు ఆర్‌ఓ ప్లాంట్లను, రూ.12 లక్షలతో జవ్వలపాలెంలో అభివృద్ధి చేసిన శ్మశానవాటికను గ్రామస్తులకు ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, క్రెడాయ్ డైరెక్టర్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకుని యాజమాన్యాలు సేవా దృక్పథంతో ముందుకు రావడం హర్షణీయమన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో క్రీడాభివృద్ధికి తలపెట్టిన క్రికెట్ స్టేడియం అభివృద్ధికి దాతలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఓం ప్రకాష్ గోయెంకా, సీమా గోయెంకాలు, చెరుకూరి సోమశేఖర్, వీరల కృష్ణ, పాలూరి వెంకటేశ్వరరావు, (బ్రదర్స్), పుల్ల బాబీ, అడపా ప్రసాద్, వర్దనపల్లి బాల కృష్ణ, పైబోయిన వెంకటరామయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతులతో టిడ్కో గృహాలు అందించాలి

మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - భీమవరం

తాడేరులోని టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలని, లేనిపక్షంలో లబ్ధిదారులందరూ స్వాధీన పర్చుకునేందుకు పిలిపిస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డికి సిపిఎం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి దశాబ్ద కాలం గడిచిన నేటికీ లబ్ధిదారులకు గృహాలు అందించలేదని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్నా లబ్ధిదారుల బాధలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాడేరు టిడ్కో ఇళ్లలో తాగునీరు, మౌలిక వసతులు పూర్తి చేసి లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలని లేనిపక్షంలో టిడ్కో ఇళ్ల స్వాధీనానికి పిలుపు ఇవ్వాల్సి వస్తుందని అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. సిపిఎం నాయకులు సిహెచ్ వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు దోకల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

తణుకు:అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్, ఎక్సైజ్, ఏలూరు కె.నాగప్రభుకుమార్ గురువారం తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ తదితర నేరాల నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పెండింగ్ కేసులో పురోగతి సాధించాలని, అన్ని పెండింగ్ కేసులలో ఛార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. తణుకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆంధ్రా డిస్టిలరీస్, వాసివి ప్రయివేట్ లిమిటెడ్‌లో గల మిథనాల్, అరాన్ యూనిట్లను తనిఖీ చేశారు. ఆయన వెంట తణుకు ఎక్సైజ్ సిఐ మణికంఠరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం:విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక దుర్గ స్ట్రీట్స్ షాప్ ఓనర్ వద్ద ఎస్.సూరిబాబు(38) దాదాపు ఐదేళ్ల నుంచి పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం రోజులానే పని నిమిత్తం సూరిబాబు వెళ్లాడు. ఈ నేపథ్యంలో గ్రైండర్ స్విచ్ ఆన్ చేస్తుండగా కరెంట్ షాక్ తగిలింది. దీంతో హుటాహుటిన తోటి కూలీలు సూరిబాబును ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సూరిబాబు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అన్నింటా మేమే నెం.1

విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఛైర్మన్ ఎన్‌వైవి.సత్యనారాయణ





ప్రజాశక్తి - ఆకివీడు

చదువుల్లోనైనా, పోటీ పరీక్షల్లోనైనా, ఆటల్లోనైనా నంబర్ వన్ విజ్ఞాన్ ఇంగ్లీష మీడియం హైస్కూల్ అని విద్యా సంస్థల ఛైర్మన్ ఎన్‌వైవి.సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏ కొద్ది మందినో కాకుండా ప్రతి విద్యార్థినీ విజేతగా నిలపాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. విజ్ఞాన్ మార్క్ ప్రణాళికల ద్వారా సాధ్యమవుతోందన్నారు. ఐఐటి, ఐఎఎస్, మెడికల్ ఫౌండేషన్ ప్రోగ్రాములకు సాటిలేని శిక్షణ తమ పాఠశాలలో అందిస్తున్నామన్నారు. కంప్యూటర్ విద్యపై శ్రద్ధ చూపిస్తున్నామన్నారు. 1989లో 9 మంది విద్యార్థులతో ఐదో తరగతి వరకూ సంస్థను ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి వరకూ కొనసాగుతూ 1400 విద్యార్థులతో పాఠశాల దినదినాభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకూ ఏటా మండల, జిల్లా స్థాయిలో తమ పాఠశాల పోటీపడుతూ రాష్ట్రస్థాయికి ఎదిగిందన్నారు. తమ పాఠశాలలో ప్రాథమికోన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పిటి.సత్య సాయి తేజ, మేడిశెట్టి కళ్యాణ్, పట్టి ఫణి కుమార్ కేంద్ర ప్రభుత్వ సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజయం సాధించి ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. అదే పరంపరలో ఉండరమట్ల నవనీత, ఆడమల్లి శ్రావ్య, ఆడమల్లి సతీష్, చెన్నూరి చరితశ్రీ, ఎమ్‌డి ఆరిఫ్‌లు తదనంతర విద్యలో ఎంబిబిఎస్ సీట్లు సాధించి ఉన్నత స్థాయికి చేరారని తెలిపారు. యాళ్ల రంగారావు ఐఐటీలో సీటు పొందారన్నారు. ఇలా చదువులోనే కాకుండా ఆటలు పాటల్లో కూడా తమ విద్యార్థులు మండల స్థాయి వరకూ ఎదిగారని వివరించారు. అనేక బహుమతులు గెలిచారని తెలిపారు. పదో పరీక్షా ఫలితాల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరు విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించి రికార్డు నెలకొల్పారన్నారు. ఈ సంవత్సరం విద్యార్థి 592 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘనత సాధించిన తమ విద్యార్థిని బుంగా హన్షితకు రూ.పది వేల నూట పదహార్లు నగదు బహుమతిని అందజేసి సత్కరించామని తెలిపారు. తమ విద్యాసంస్థలో ఉత్తమ విద్యనందిస్తున్నామని తెలిపారు.

జులై 9న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

జులై తొమ్మిదిన జరిగే దేశ వ్యాప్త సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలని గురువారం స్థానిక బిటి రణదివె భవనంలో జరిగిన ప్రజాసంఘాల మండల సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో పాల్గొన్న సిఐటియు మండల అధ్యక్షులు ఎం.పెంటారావు మాట్లాడుతూ కార్మికులకు నష్టం తెచ్చే లేబర్ కోడ్ లను రద్దుచేయాలని కోరుతూ జులై తొమ్మిదిన జరిగే సమ్మెలో కార్మికులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెచ్చేటి నరశింహమూర్తి, కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్నం చిన నాగేశ్వరరావు, గణపవరం సిఐటియు నాయకులు కె.త్రినాథ్ పాల్గొన్నారు.



పెంటపాడు : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

పెంటపాడు : కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ వెనక్కి తీసుకునే వరకూ పోరాటం ఆగదని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అన్నారు. గురువారం ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను రద్దు చేయడం మానుకోవాలన్నారు. కార్మికులను శ్రమ దోపిడీ చేయడానికే లేబర్ కోడ్స్ తీసుకొస్తున్నారని విమర్శించారు. జులై తొమ్మిదిన జరిగే సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రైతాంగం పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రాల్లో జరుగుతున్న నిరసనలను జయప్రదం చేయాలని వారు కోరారు. పెనగంటి దుర్గ, పూడి బాలాజీ. వెలగల దానిరెడ్డి, బంకరు మణికంఠ, చిన్న, సిరపు రాజు, నబ్బా ప్రవీణ్, కవల కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

నరసాపురం:ముఠా కార్మికులకు హెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు డిమాండ్ చేశారు. సరిపల్లి గ్రామ పంచాయతీలోని సివిల్ సప్లై గోడౌన్స్ వద్ద సివిల్ సప్లై కార్మికులు జులై తొమ్మిదిన తేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ పెట్టుబడిదారులకు అనుకూలంగా లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చేందుకు బిజెపి ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నోముల కొండ, సివిల్ సప్లై కార్మిక నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, పితాని రవి, మల్లుల రామ చక్రవర్తి, గుత్తుల రఘుబాబు, ఆరవ సత్యనారాయణ, ఆకన దుర్గారావు, ఆకన శ్రీనివాస్, ఆకన రాంబాబు పాల్గొన్నారు.

ఉండి : కార్మికుల హక్కులు కాపాడేందుకు జులై తొమ్మిదో తేదీన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ కోరారు. గురువారం ఉండి శ్రీనివాస మోడ్రన్ రైస్‌మిల్లు కార్మికులకు కార్మికుల హక్కులపై అవగాహన కల్పించి సమ్మెలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలు సమ్మెలో పాల్గొనాలి

ప్రజాశక్తి - ఆచంట

కేంద్ర ప్రభుత్వానికి ఉపాధి హామీ కూలీలు పట్ల చిత్తశుద్ధి ఉంటే ఆ చట్టానికి బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సిర్రా నరసింహమూర్తి డిమాండ్ చేశారు. గురువారం పెనుమంచిలిలో తాడేరు మురుగు కాలువ వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సంఘం నాయకులు సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు కూలి రేట్లు పెంచాలని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అనంతరం నరసింహమూర్తి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని నీరుగార్చడానికి చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండుటెండలో మురుగు కాలువ శుభ్రం చేస్తున్నా నిర్దిష్ట కూలి రూ.307 కూడా రావడం లేదని, కనీసం జీవించడానికి రూ.307 ఎలా సరిపోతాయని వాపోయారు. కూలీలంతా ఒక్కరోజు పని మానేసి సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.మోహన్‌రావు, వర్ధనపు శ్రీరాములు, సత్యనారాయణ, మానుకొండ వీర్రాజు, నాగవేణి, వెంకటలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

పెనుగొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీలో పనికి కొలతలు పెట్టి వేతనాన్ని చెల్లించడంలో శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్‌కె పాదుషా అన్నారు. గురువారం దొంగరావిపాలెం బ్యాంకు కెనాల్‌లో పనిచేస్తున్న ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. కూలి పనికి కొలతలు పెట్టడం కూలి దోపిడీ చేయడానికేనని విమర్శించారు. ఉపాధి పనికి వెళ్లే సమయంలో గానీ, పని నుండి తిరిగి వచ్చే సమయంలో గాని, పని సమయంలో గానీ ప్రమాదం జరిగితే ఆ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేని తెలిపారు. ఈ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పే విధంగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

తిరుమల విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పాలిసెట్, ఎపిఆర్‌జెసి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. గురువారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలిసెట్‌లో 120కి గాను 120 మార్కులు సాధించిన పి.రోహిత్, ఎపి ఆర్‌జెసిలో స్టేట్ 11వ ర్యాంకును సాధించిన బిఎన్.చంద్ సమీర్లను అభినందించారు. 120 మార్కులు సాధించి పి.రోహిత్ స్టేట్ 12వ ర్యాంకును కైవసం చేసుకున్నారు. బిఆర్‌డి.సాయి కిరణ్ 119 మార్కులతో స్టేట్ 39వ ర్యాంకు, వై.లాన్యశ్రీసాయి 118 మార్కులతో స్టేట్ 111వ ర్యాంకు, కెహెచ్‌విఎన్ఎస్‌డి.హిరణ్మయి 183వ ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే ఎపిఆర్‌జెసిలో బిఎన్.చంద్ సమీర్ 150 మార్కులకు 141 మార్కులతో స్టేట్ 11వ ర్యాంకు, పి.రోహిత్ స్టేట్ 17వ ర్యాంకు, కెజిఎన్.చైతన్య స్టేట్ 22వ ర్యాంకు సాధించారు. వారిని సంస్థ డైరక్టర్లు ఎన్.సాయిరాజు, పి.శ్రీనివాస వర్మ, జి.సతీష్‌బాబు అభినందించారు. స్టేట్ ర్యాంకు 100లోపు ఏడుగురు, 500లోపు 28 మంది, వెయ్యిలోపు 40 మంది సాధించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలను సాధించడానికి సహకరించిన తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

అంబేద్కర్ జీవిత చరిత్ర కళారూప ప్రదర్శనకు తరలిరావాలి

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి విజయకుమార్, క్రాంతి బాబు

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్ జీవిత చరిత్ర కళారూప ప్రదర్శనకు తరలి రావాలని కెవిపిఎస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతిబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా కమిటీ తరపున వారు ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేద్కర్ భావజాలం నేటి యువతరానికి ఎంతో అవసరమని తెలిపారు. అంబేద్కర్ జీవిత చరిత్రను ఆధునిక సాంకేతికతతో కళారూపాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 17వ తేదీన జిల్లా కేంద్రమైన భీమవరం పట్టణంలో గునుపూడిలో పెద్ద ఎత్తున నాటక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యావత్ ప్రజలందరూ ఈ నాటక ప్రదర్శనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాటక ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు, శాసనమండలి సభ్యులు బొర్రా గోపీమూర్తి, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ తరపున అంబేద్కర్ బుద్ధిష్ట్ కెకె.రాజా, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం, ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ నాటక ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో ఉన్న దళిత, గిరిజన, సామాజిక ఉద్యమ నాయకులందరూ పెద్ద ఎత్తున హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

CHANGE OF NAME

I, Kollaparthi Venkateswara Rao, S/o. Kollaparthi Lakshmana Swamy, R/o. H.No: 4-137, opp Tata Cell Tower, Khandrikagudem, Eluru, Eluru District, Andhra Pradesh, Pin-534005. I have changed my name from Kollaparthi Venkateswar Rao (Old Name) to **KOLLAPARTHI VENKATESWARA RAO** (New Name). Hence forth I am being called as **KOLLAPARTHI VENKATESWARA RAO** (New Name) for all purposes

ముఖ్యమంత్రిని కలిసిన పెద్దిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణానికి చెందిన కొల్లు పెద్దిరాజు రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య ఛైర్మన్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మైనార్టీ సలహాదారులు, మాజీ మండలి ఛైర్మన్ ఎంఎ షరీఫ్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జక్కం శ్రీమన్నారాయణతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీకి మంచి పేరు తీసుకురావాలని చంద్రబాబు నాయుడు సూచించినట్లు పెద్దిరాజు తెలిపారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

నరసాపురం:పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సిబ్బందితో కలిసి అన్నా క్యాంటీన్లో స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లలో ఐదు రూపాయలకే పేదలకు ఆహారం అందిస్తోందన్నారు. క్యాంటీన్ల సమయం, ఆహారంపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా మార్పులు చేస్తున్నారన్నారు. డిఇ ప్రవీణ్, చంద్ర పాల్గొన్నారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE

Roc.No.2422/E1/2023-24 Dated.15/05/2025

Sl. No.	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Start Date	Last Date for Reciept of Bids
1.	Providing new Culverts in 25th Ward Primary School, Operation & Maintenance of AMRUT & TIDCO Pumping Stations at HWW and Providing Yard Lighting in TPG Mpl.Office Premises-3, Works-3	General	13.61	16/05/2025	30/05/2025

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit web site https://tender.apeprocurement.gov.in.

Sd/- Commissioner
Tadepalligudem Municipality.

పిహెచ్‌సి పరిశీలన

గణపవరం:పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా అదనపు వైద్యాధికారి బి.భానునాయక్ పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులపట్ల గౌరవంగా మెలగాలన్నారు. ఆసుపత్రిలోని లేబ్‌ను, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కె.ప్రియాంక, జి.వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్టు నాగమణి పాల్గొన్నారు

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి మరియు మోటారు ఆక్సిడెంట్సు క్రైమ్స్ (మహిళా కోర్టు), ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

M.V.O.P.No.36/2025

కుమారి మద్దుకూరి రమ్య ...పిటీషనరు
మరియు
1.తాడికొండ మనోహర్ సందీప్
2.డి.హెచ్.డి.యఫ్.సి.జనరల్ ఇన్స్యూరెన్సు ...రెస్పాండెంట్సు

పత్రికా ముఖంగా పైకోర్టు వారి ఆదేశాను సారంగా కుమారి మద్దుకూరి రమ్య పై కోర్టు వారి ఎదుట తనకు మోటారు యాక్సిడెంటుకు నష్టమునకు పరిహారం కోరుతూ పైన తెల్పిన వారి పైన పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పైన తెల్పిన 1వ ప్రతివాది తాడికొండ మనోహర సందీప్ గారి దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుట వలన పై కోర్టు వారు **ది.6-5-2025న** పత్రికా ముఖంగా నోటీసు యిచ్చుటకు గాను ఉత్తర్వులు యిచ్చినందున సదరు 1వ ప్రతివాది మనోహర్ సందీప్ గార్కి తెలియచేయునది ఏమనగా పైదావా గ్రంథం పై కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తం **ది.20-6-2025**కు వాయిదా అయివున్నందున మీరు ఆరోజు అనగా ది.**20-6-2025** ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరు కావలసినదిగా కోరడమైనది. లేని యెడల సదరు దావా గ్రంథం మీ పరోక్షంలో పరిష్కరించబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది.

ఎన్.కృష్ణమూర్తి
ఏలూరు, పిటీషనరు తరపు న్యాయవాది
తేది.07-5-2025 అశోకనగర్,ఏలూరు.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.48/2024 in O.S.No.41/2017

Between:
కుసుమే వెంకటేశ్వరరావు ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
And
బర్రె నందిరాజు ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టార్
To.
బర్రె నందిరాజు, తండ్రి సుబ్బారావు, వయస్సు 55 సం॥లు, పురుషుడు, వ్యాపారం, డోర్‌నెం.34-25, వెన్నపువారిపాలెం, H/o.ఆచంట, ఆచంట మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని **ది.16-6-2025వ తేదీన ఉ.గం.10.30 ని.ల** లగాయితు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూల్

West Godavari District, Achanta Sub Registrar area, Achanta Mandal, Achanta Gram Panchayat area, Achanta Village.

Item No.1: In R.S.No.946/2, Zeroyath Wet Land to an extant of Ac.0.32 Cents with in following boundaries.
East : Land belongs to Bokka Raghavulu
South: Land belongs to Vennapu Babu Rao
West : Property belongs to Bokka Chandrakala
North: Property belongs to Barre People.
D.H.R Value : Rs.3,00,000/-
Amin Value : Rs.10,00,000/-

Item No.2: In R.S.No.919/13, Zeroyath Wet Land to an extant of Ac.0.09 Cents & in R.S.No.919/17 Zeroyath wet land to an extant of Ac.0.07 Cents in total to an extant of Ac.0.16 Cents consisting as a single plot with in following boundaries. East: Land belongs to Pathagolusu Ramudu, South : Land belongs to Barre People & Matta Manikyam, West : Property belongs to Tarivitala Kattlayya. North: Property belongs to Vennapu Mohana Rao.
With all easementary rights.
D.H.R. Value : Rs.1,00,000/-
Amin Value : Rs.5,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పాలకొల్లు **మేడపాటి వెంకట రామారెడ్డి**
13-05-2025 న్యాయవాది,
పాలకొల్లు, ప.గో.జిల్లా.

వేలం ప్రకటన
మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.2/2020 in O.S.No.30/2016

Between:
బురాబత్తుల వెంకటరెడ్డి (Died) వగైరా ...పిటీషనరు/డిక్రీ హోల్డర్
And
పాలా అంజమ్మ @ పార్వతి వగైరా ...రెస్పాండెంటు/జడ్జిమెంట్ డెబ్టార్స్
To.
1.పాలా అంజమ్మ @ పార్వతి, భర్త వెంకటరావు, వయస్సు 55 సం॥లు, గృహిణి, డోర్‌నెం.10-109/1, అంబటి వాని చెరువు, H/o.పోడూరు, పోడూరు మండలం.
2.పాలా శ్రీనివాసరావు, తండ్రి వెంకటరావు, వయస్సు 42 సం॥లు, వ్యాపారం, డోర్‌నెం.10-109/1, అంబటి వాని చెరువు, H/o.పోడూరు, పోడూరు మండలం.
3.బురాబత్తుల లక్ష్మి, భర్త శ్రీనివాసరావు, వయస్సు 22 సం॥లు, డోర్‌నెం.1-54, పెంకుళ్ళపాలెం, కవిటం, పోడూరు మండలం.
4.పాలా ఇందిర, తండ్రి వెంకటరావు, వయస్సు 20 సం॥లు, డోర్‌నెం.10-109/1, అంబటి వాని చెరువు, H/o.పోడూరు, పోడూరు మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంట్ డెబ్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని **ది.18-6-2025వ తేదీన ఉ.గం.10.30 ని.ల** లగాయితు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసినవారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూల్

West Godavari District, Palakol Sub Registration District, Poduru Mandal, Penumadam Village, an extent of Ac.0.30 cents of land in R.S.No.126/1A/6A of Penumadam Village with in following boundaries.
East : Land of Balam Rameswaram
West : Land of Kukkala Venkata Reddy
South : Land of Tannadi Gani Raju
North: Land of Kukkala Venkata Reddy
With all easementary rights.
Amin Value : Rs.15,00,000/-
D.H.R. Value : Rs.8,00,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పాలకొల్లు **మేడపాటి వెంకట రామారెడ్డి**
13-05-2025 న్యాయవాది,
పాలకొల్లు, ప.గో.జిల్లా.